పది రూపాయలు!

— 'బాబురావు'

'పండ్లమ్మో పండ్లూ.

అదే తీయని కంఠస్వరం. అదే మంటలు రగిలించే కేక—మూలమలుపునించి.

సారథి పెద్ద పెద్ద అంగలు వేశాడు.

తనలోని ఆరాటాన్ని ఎవరైనా గమనిస్తున్నారేమో నని ఉలిక్కి పడ్డాడు. అటూ యిటూ చూస్తే బోలెడంత మంది రోడ్డువెంబడి వస్తున్నారు. ఒక్కరూ తనవైపు చూడ్డంలేదు. ఎవరిమూడ్‌లో వారున్నారు. ఎవరి స్పీడ్‌లో వారు నడుస్తున్నారు.

మూలమలుపు తిరిగాడు.

ముప్పైగజాల దూరంలో ఆమె.

మూణ్ణిమిషాల్లో ఆమె వెనక్కి వచ్చి చేరాడు.

శలాక లాంటి దేహం. రాగివెంట్రుకల సిగ. బొడ్డుమల్లె పూలచెండు. తలమీద పండ్లగంప.

ఆమె మళ్లీ కేకేసింది. 'పండ్లమ్మో.

ఈ తీయని కేకే కొద్దిరోజుల్నించి తనలో అశాంతి రేపుతున్నది. అయస్కాంతంలా ఆకర్షిస్తున్నది. అగ్ని రగిలించి కాల్చివేస్తున్నది, సిగ్గునూ, గౌరవాన్నీ, అభిమానాన్నీ నొక్కిపెట్టేసి, కళ్ళలో కామాన్నికొట్టి గుడ్డివాన్నిచేసి తనవెంట ఈడ్చు కుంటున్నది.

అత్రానికి వూపిరాడడం లేదు.

చుట్టూ మరచిపోయి, ఆమె నడుంచుట్టూ చూపునుపట్టి నడుస్తున్నాడు.

అలా నడనడం దుర్భరంగావుంది.

ఎన్నిరోజులని పరిగెత్తడం? యెంతదూరమని పరిగెత్తడం?

ఈ పదిహేడేండ్ల పండ్లమ్మలో ఇంత ఆకర్షణ యెక్కణ్ణించి వచ్చింది.

ఏమో. ఈ ప్రశ్నకు జవాబు తన కనవసరం.

ఆ పండ్లమ్మ పండ్లుకూడా అనవసరమే. అవసరమయిందల్లా స్వయంగా ఆమె

ప్రశ్నకు జవాబును వెతుక్కోలేకకాదు ఇన్నిరోజుల్నించీ తాను బాధపడు తున్నది. ఆమె అమ్మే పండ్లను కొనుక్కోలేకకూడాకాదు. స్వంతంగా ఆమెను కొనుక్కోలేకనే.

ఇక్కడ మలుపుంది. తికమకపుంది. చదరంగం గళ్ళలో మార్గం దొరకడం లేదు.

ఆమె అవే బట్టల్లోవుంది. రెండురోజుల కింద ఆమెశరీరం మీద తానుచూసిన బట్టలే వాటిని ఆమె మార్చినట్లులేదు.

నల్లని వాయిలు గుడ్డ జాకెట్టు పట్టుపడక, పిటపిటమని కుడిచంకలో చినిగిపోతున్నది. జాకెట్టులోంచి కనిపిస్తూన్న బాడీ ఆమె వయసు పంపుసొంపుల బిగువుకు పట్టుకోలేకపోతూన్నట్లుగా వుంది. గోచీ పెట్టికట్టిన మట్టిరంగు చేనేత చీర మాసిపోయింది. అయితేనేం—ఆమె అందాల రేఖల సొగసుల్ని యే మాత్రమూ పాడుచేయడము లేదు.

కలెక్టరాఫీసు దాటిపోయింది. పోలీసుస్టేషన్ దాటిపోయింది. సారధి ఇంటి దోవ కూడ దాటి పోయింది.

ఆమెను మాత్రం దాటిపోనివ్వడం ఇష్టంగాలేదు.

ఆమెనడుస్తూ ఉంటే వయ్యారంగా, శరీరం మెలికలు తిరుగుతున్నది. పిరుదులు అటూ యిటూ కదలుతున్నాయి. కాళ్ళకున్న వెండి బోలు కడియాలు గలగల చప్పుడు చేస్తున్నాయి. దుమ్ము కొట్టుకున్న ఆమె పాదాలు తారు రోడ్డుమీద కాదు అడుగులు వేస్తున్నది. తన గుండెమీద, వయసుమీద——

ఆమె వెంకటేశ్వరాలయం దగ్గర మలుపు తిరిగింది.

అతడు వెళ్ళేసరికి ఆమె కనిపించలేదు. రోడ్డుచివరిదాక ఎక్కడా ఆమెలేదు.

హతాశుడై ఆలయంలోకీ చూస్తే —— అక్కడ గట్టుమీద పండ్ల గంప కనిపించింది,

పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయింది.

గబ గబా లోపలికి వెళ్ళాడు.

ఆలయ ప్రాంగణంలో ఓ వైపువున్న పంపు దగ్గర కాళ్ళూచేతులు కడుక్కుంటున్నది ఆమె.

అతడక్కడే గంపకు కొద్దిదూరంలో నించున్నాడు.

గర్భాలయానికి ఊచల తలుపులు వేసి, తాళంవేసి ఉంది. లోపలినుండి బంగారంతో మెరుస్తూ ఉన్న వేంకటేశ్వరుని విగ్రహం ఛాయామాత్రంగా కనిపిస్తూన్నది. ధూపదీపాల వాసనలేచి వచ్చి అక్కడంతా అలుముకుని ఉంది.

ఒకవైపు బాదంచెట్టు ఒకటి, బొడ్డు మల్లెచెట్లు రెండు ఉన్నాయి. పక్కన విశాలంగా వేసి ఉన్న పందిరి మీద నిండా పూలతీగలు అల్లుకుని ఉన్నాయి.

పన్నెండు కాలేదు ఇంకా.

గద్దెల మీద ముగ్గురు వ్యక్తులు కూర్చుని, 'గుడుగుడు' పీలుస్తూ ఏదో చర్చలో మునిగి ఉన్నారు. బొడ్డుమల్లె చెట్టుకింద నలుగురు ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడు రాలిన పూవును రాలినట్లే ఒడిసికన్న ముందుగా ఒకళ్ళు అందుకుంటున్నారు.

ఆమె మొగం కడుక్కుంది. వంగి దోసిలిపట్టి నీళ్లు తాగింది, చెంగు తీసి తుడుచుకుంది.

గంప దగ్గరకు వచ్చిన ఆమె చూపులు అతని మీద పడ్డాయి,
ఆ చూపులు —— అవి సంకెళ్ళు.
ఆ కళ్ళు —— అవి అగాధాలు,
అతడు చూపు మరల్చుకో లేక పోయాడు.
అతని చూపు ఆమెకు అభ్యంతరం కాదులా ఉంది.
దగ్గరగా వచ్చి అడిగింది.
'పండ్లు కావాలా?'
తత్తర పడ్డాడు ఆశ్చర్యపోయాడు. ఆమె కళ్ళలోకి గుచ్చిగుచ్చి చూశాడు.

ఆకళ్ళు నిర్మలంగా. నిశ్చలంగా ఉన్నాయి. ఏ రహస్యమూ దాగివున్నట్లు లేదు. కాని కొంచెం పరిహాసం, మరికొంచెం ధైర్యం ఉన్నట్లున్నాయి.

చూపు మరల్చుకోకుండానే అడిగాడు.

ఏమేం పండ్లున్నాయి?

ఆమె నవ్వింది.

ఆ నవ్వుతో ఎండ వెన్నెలగా మారింది.

'అరటి పండ్లు, సేపులు, అంగూర్లు, మోసంబీలు....

'ధర?'

చూసినంత.

గంపమీది మకిలి గుడ్డ తీసింది.

ఇంకా దగ్గరకు వచ్చాడు.

'బాగానే వున్నాయ్—ఈ అరటి పండ్లెట్లా?,

రూపాయికి డజను,

'ఊర్లో ఎనభై పైసలకే.

'ఔ. వాడు తన దుకాండ్ల కూసుండి అమ్ముతడు. మేము వాడ వాడకు అమ్మాలె, ఎన్నికావాల్నో చెప్పు. నీకు తొంబై పైసలకే ఇస్తా.'

నవ్వాడు.

'ఐనా ఇంకా పదిపైసలు లాభం'

ఆమె కనుగ్రుడ్లను గమ్మత్తుగా తిప్పింది. వెక్కిరిస్తున్నట్లుగా పెదవుల్ని ఆడించింది.

అయ్యోరామా! మీ పదిపైసల్తో మేం ఒటికి బంగులాలు కట్టుకోమూ? మా బంగులాలు మీ బంగులాలకు పోటీపడితే మీకు నామర్ద కాదూ?

ఇలాఅని ఆమె కిలకిలానవ్వింది.

ఆనవ్వుకు అతని రోమాలు నించున్నాయి.

ఏమీఅనలేక తానూ నవ్వాడు.

చెప్పు అరటిపండ్లెన్ని కావాల్నో ఆమెఅంది.

నువ్వేచెప్పు, ఎన్నిస్తావు?

అంత దగ్గరగాఆమె—మధ్యలో ఒక పండ్లగంపే.

పిచ్చెత్తుతూన్నది.

ఆమె చూపు మరల్చుకోవడంలేదు. తల దించుకోవడం లేదు.

నీ జేబుల పైసలెన్ని ఉన్నాయో నాకెట్ల తెలుస్తది?

'నా జేబులో ఉన్న పైసల గురించి అనుమానంగా ఉందా నీకు,
'నాకెందుకనుమానం? నువ్వు కొనకుంటే నాపండ్లు అమ్ముడు పోవాయేంది?'

కొంచెం పిరికిగా, కొంచెం ధైర్యంగా ఆమె కళ్ళలోకి కొత్తగా, వింతగా, వెర్రిగా చూశాడు.

వయసూ, అందమే కాదు, మాటకారితనం కూడా ఉంది ఆమెలో! ఆమె వయసునూ, అందాన్నీ లొంగతీసుకోవడానికి ధైర్యం చాలును. చొరవ చాలును, డబ్బు చాలును, కాని ఇదేమి! ఆమె మాటకారి తనాన్ని లొంగ తీసుకోలేవు.

ఈ లోకంలో ప్రజ్ఞ గలవాళ్లే గెలవడం లేదు. ప్రజ్ఞ అనేది ఓఅద్వాంపేటి కూడ కారిపోవచ్చు. దానికి అండగా మరెన్నో ఉండాలి. అవన్నీ తనకు వున్నాయా లేవోనని వెనకా ముందు చూడ్డం తెలివితక్కువ తనమే.

'నీకు అమ్ముడు పోతాయి నిజమే. కాని నీపండ్లు నాకెట్లాదొరుకుతయ్?
ఆమె కళ్ళుపెద్దవి చేసింది. తర్వాత నవ్వింది,
బిత్తరపోయాడు.
'నవ్వెందుకు?'
నవ్వనాపు. 'నా పండ్లే కావాల్నా?' అని అడిగింది.
'ఔను' పెదవులు వణికాయి.
ఆమె వంగింది, అరటిపండ్ల గుత్తి తీసింది.
'నాకు అరటిపండ్లు వద్దు; కళ్ళు ఎరుపెక్కాయి.
'మరేం కావాలె?'
రక్తం మెదడులోకి చిమ్ముతున్నది. ఊపిరి బిగ బట్టాడు.

'ఈపండ్లు' ఆమె వక్షాన్ని చూపుతూ అన్నాడు.— 'ఈ పండ్లు. ఇవి కూడా' పెదవుల్ని చూపాడు.

ఒక క్షణం కదలిక లేకుండా నించుంది. తర్వాత నవ్వింది,

ఆ నవ్వుల వాగులో పడి అతని వణుకు కొట్టుకుపోయింది. భయం, లజ్జ మునిగిపోయాయి.

అబ్బో! అంది.

అటూ యిటూ చూసి నీరు మింగాడు.
నీలు ఆరతి చేసు ఇటువైపే వస్తున్నారు. తొరగా తేల్చేసుకోవాలి.
'ఎంతిస్తవు?' ఆమే అడిగింది.
ఆమె ప్రశ్నకి ఆశ్చర్యపోయాడు.

ఆమె కంఠంలో గాని, కళ్లలో గాని, వేళ్ల చివర గాని, పెదవుల కదలికల్లో గాని ఎక్కడా భయం గాని, లజ్జగాని, దాపరికంగాని, వణుకుగాని లేనే లేవు.

'ఇప్పుడిదీనంత?' అన్నాడు మెల్లగా.
'పది రూపాయిలిస్తా'.
ప్రపంచమంతా తన కాళ్ల క్రిందికి వచ్చినట్లుగా వుంది.

ఆమె — ఆ పండ్లమ్మే తనదవుతుంది. పది రూపాయిలు — ఒక కాగితం. ఒక బొమ్మ జానేదేవ్.

'ఐతే పద'.
"ఎటు?"
"నా రూంకు."
"ఎవళ్లేరా?"
"లేరు."
ఆమె నవ్వింది. అతడూ నవ్వాడు.

ఆమెకు పండ్లగంప భారంగా వుంది. తనకు కోరికలగంప భారంగా వుంది, ఆమె పండ్ల గంపను తానెత్తాలి. తన కోరికల గంపను ఆమె ఎత్తుతుంది.

ఇందుకుగాను ధర పది రూపాయిలు!
ఒక్క మాటతోనే బేరం కుదిరింది. కొసరింపులు, కన్సెషన్లూ లేనేలేవు.
ఇందుకు సాక్షి కటకటాల లోపలి వేంకటేశ్వరుడు.
అతడు గంపను ఆమె నెత్తిమీది కెత్తాడు,

సారథి రూంలో గంటన్నర తర్వాత—
"నీ పేరు?"
"నా పేరుతోటి పని యిప్పుడు పడ్డదా?"

నవ్వాడు.
ఆమె మాట్లాడలేదు.
"చెప్పు."
"సీతమ్మ."
"సీతమ్మ!"

అతను రిపీట్ చేశాడు. ఆ మాటలో అతని హృదయం యొక్క ఉలిక్కిపాటు వుంది. అది అతను గ్రహించలేదు. ఆమె కూడ గ్రహించినట్లులేదు.

"నీ మొగుని పేరు?"
అతని కళ్లలోకి చూసి, మొగాన్ని దిండులోకి దాచుకుంది.

ఆమె మొగాన్ని తన వైపు తిప్పుకోవాలని ప్రయత్నం చేశాడు. సాధ్యం కాలేదు.

'చెప్పవా?'

'సిగ్గా?'

"అబ్బో!"
హఠాత్తుగా ఆమె దిండులోంచి మొగాన్ని తిప్పింది.
'నాకు సిగ్గెందుకు? ఆయన పేరు రామయ్య.'
"రామయ్య!"
మళ్లీ రిపీట్ చేశాడు.
ఆమె వివరాలడగడానికి యిక అతనికి ధైర్యం రాలేదు.
మరో పావుగంట తర్వాత ఆమె అన్నది.
'ఎందుకు సిగ్గుపోతావ్? నప్పుడేం పెండ్లి చేసుకో'.
అతనికి భలే నవ్వు వచ్చింది.
'నవ్వుతావెందుకు? రేపు నీ పెండ్లాంగ వచ్చేదాని గతి ఏం కావాలె?'.
"నాకు యిరవై రెండేళ్లు అతనన్నాడు."
'ఐతే?'
"నీకు పదిహేడేళ్ళ కన్నా ఎక్కువుండ వనుకుంటా."
'ఔ, కాని....'

"నీకన్నా నేను ఐదేళ్ళు పెద్ద. నీవు మొగుడుండగానే చెడిపోయావు. పెండ్లాం లేకుండా నేనెట్లా చెడిపోకుండా వుండను?"

ఆమె నవ్వింది.

'నీ గురించి నీకే పట్టలేదు గాని ఎప్పుడో వచ్చే నా పెండ్లాంగురించిన పట్టింపు నీకెందుకు?'

ఆమె జవాబు చెప్పలేదు. అసలు జవాబు తోచినట్లు లేదు.
మళ్ళీ నవ్వింది.
ఆ నవ్వును జవాబుగా తీసుకోవడానికి అతనికి మనసొప్పలేదు.
'ఎందుకు నవ్వుతావు?'
'నువ్వు నా కన్న పెద్దోడివైనా, నీకేం తెలువదు'.
ఈ సారి నవ్వడం అతని వంతయింది.

ఆమె రిమార్కు చాలా సూటిగా వుంది. వాడిగా వుంది. దాన్నెలా ఖండించడం? అది అబద్ధమని నిరూపించడమెలా? అందుకు ఆమె తనకేం తెలుసునని?

తికమక పడ్డాడు.
ఇక అటువైపు వెళ్ళే ధైర్యం లేక మాట మార్చాడు.
'నీ ఒళ్ళంత చెమటకంపు స్నానం చేసి ఎన్ని రోజులయింది?
'రెండు రోజులు.'

'స్నానం చేయకున్నా పోనీగాని, ఈ చీర, జాకెట్టన్నా ఉతకేసుకుంటే ఏం పోయింది?'

'ఏం పోదు.'
'మరి?'
'నా మొగునికి వాసనంటేనే తెలువదు.'
'థూ' అన్నాడు.
ఆమె అతని కంపరపాటును చూసి కిలకిల నవ్వింది.
వెర్రిగా ఆమె మీద పడ్డాడు.
'వాసన' అంది.
తన నోటితో ఆమె నోటిని మూశాడు.

ఓ చేత ఐదు రూపాయిల నోటును పట్టుకుని, మరో చేత సింగులు సర్దుకుంటూ ఆమె అంది.

'ఇంకా ఐదు'.

చేయి జేబులోనే వుంది. చేతికి నోట్లు తగులుతూనే ఉన్నాయి.

కాని,

'ఇంకా ఐదు రూపాయిలా!'

తటపటాయించి అన్నాడు.

'లేవు'.

చిరెత్తింది.

'పరాసికం చాలు. ఇయ్యి ఒర్డి.'

పెంకెగా వుంది మాట.

'నిజంగా లేవు.'

బొంకుగా వుంది మాట.

ఆమె కళ్ళు కోపంతో యెర్రబడ్డాయి.

'అప్పుడు—— మరి పది యిస్తానన్న వెందుకు?'

ఇస్తానన్నాడు నిజమే అది దేవుని సుందర. ఇవ్వాలనుకున్నాడు. అది నిజమే. కాని యిస్తే ఏపెట్లా? ఎన్నెన్నో ఖర్చులున్నాయి. ఆ ఎన్నెన్నో ఖర్చులకు డబ్బులు కావాలి. మొదటి తారీఖు యింక పదహారు రోజులగ్గాని రాదు. అందుకని యివ్వలేదు.

జేబులోంచి చేయి తీశాడు. ఆమె చేతుల పట్టుకున్నాడు.

ఆమె ప్రశ్నకు జవాబు చెప్పకుండానే ఆమెను దగ్గరకు లాక్కున్నాడు. మంచం మీదకి లాక్కుపోయాడు మళ్లీ. ఆమె ఏమీ అనలేదు.

'నా ఐదు రూపాయిలు' అంది చివరికి మళ్ళీ.

అతడు గడియారం చూసుకున్నాడు.

'ఫ్రండ్స్ వచ్చే టైం అయింది'.

'తొందరగా వెళ్ళిపో'.

'ఐదు రూపాయిలియ్యి'.
'లేవు'.
'ఇక్కణ్నుంచి పోను'.

చిరాకు వేసింది. పెధప ఐదు రూపాయిలు. ఇచ్చి వేద్దామనిపించింది.
కాని,

ఆమె గొంతు పట్టుకున్నాడు.
'ఫస్టునాడు రా యిస్తా'.
ప్రాధేయత వుంది మాటలో.

'ఫస్టునాడు నాకు నువ్వు యియ్యాల్నా? నువ్వు నన్నడుగుతె, ఆ నాడు నేనే

'నాకే యిచ్చేదానివి, నీకిక రూపాయిలెందుకు?'
'నీ జనాటోళ్లకిచ్చేటందుకు'.
అతనికి కోపం వచ్చింది.
'ఒకసారి చెప్తే వినాలి' అంటు విసుక్కున్నాడు.
'వినవోళ్ళెవలు? నువ్వా, నేనా?'
ఇక్కడ కూడా ఆమెకు భయం వున్నట్టులేదు.
నోటికొచ్చింది వాగకు'.
'కోపమెందుకు? పది రూపాయిలిస్తనన్నవు. యియ్యమంటూన్న'.
'ఇవ్వను'.
'యిచ్చి తీరాలె'.
'యివ్వకుంటే?'
'యిక్కణ్నుంచి పోను'.
'నీకు డబ్బెక్కువ కావచ్చుగాని, నాకు పరువెక్కువ'.
ఆమె నిశ్చలంగా అతని కళ్ళలోకి చూసింది.
ఆ చూపున్ని ఎదుర్కోలేక తల దించుకున్నాడు.
శాంతంగా మామూలుగా అంది ఆమె.
'నీ డబ్బులు వద్దు నాకు. నీ పరువు కూడ వద్దు'.

ఇలా అని ఐదు రూపాయిల నోటును జాకెట్టులోంచి తీసి మంచం మీద

పెటింది.

అతడు నోరు తెరచాడు.
ఆమె తలమీదికి పండ్ల గంప నెత్తుకుంది.
'తలుపు తియ్యి' అంది.
ఒక నిమిషం వరకు మాట్లాడలేక పోయాడు.
మంచంమీది ఐదురూపాయల నోటును తీసుకుని ఆమె ముందు నిలుచున్నాడు.
మెల్లగా అన్నాడు.
'సీతా.

ఒకింత సేపు ఆమె అతని మొగంలోకి చూస్తూ నిలుచుంది. క్రమంగా ఆమె పెదవులు విచ్చుకున్నాయి.

తలమీది గంపని కిందికి దించింది.
రెండు చేతుల్తోనూ అతన్ని వాటేసుకుని మొగం నిండా ముద్దులు పెట్టింది.
తానే తలుపు తీసింది.
గంప నెత్తుకుని 'పోత' అంది.
'రూపాయిలు....?' గొణిగాడు.
'వద్దు'.
ఆమె వెళ్ళిపోయింది, పెదవుల మీద చిరునవ్వుతో.
అక్కడే నిలుచున్నాడు.
కొద్ది సేపట్లో అతని పెదవుల మీద చిరునవ్వు వెలసింది.
'పోనీ మనకే లాభం. ఈ ఐదు కూడా మిగిలాయి........'
ఫర్లాంగు దూరం నుంచి ఆమె కేక—
'పండ్లమ్మో పండ్లు'.
వెంటనే అతని పెదవుల మీది చిరునవ్వు మాయమయింది.
మళ్ళీ నవ్వాలని ప్రయత్నించి కూడా నవ్వలేక పోయాడు.

వ్యక్తిత్వాన్ని దెబ్బతీసి, గర్వాన్ని తలగొట్టి, నవ్వును ఎగరగొట్టేసి తన నేలా కట్టిపడేసిన మహత్తు ఆమె కేకలో ఏమి వుందో— అది ఎంత ఆలోచించినా ఎంతో సేపటిగ్గాని సారథికి అర్థం కాలేదు.